సాక్షి కర్నూలు

మంగళవారం • 5 • ఆగస్టు • 2025



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం నిత్యకళావేదికపై విజయవాడకు చెందిన కళాక్షేత్ర డ్యాన్స్ అకాడమీ వారి కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది.



ఉరుకుంద క్షేత్రం.. భక్తజన సంద్రం

శ్రావణమాసం రెండో సోమవారం ఉరుకుంద క్షేత్రం భక్తజన సంద్రమైంది. ఇరు తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక రాష్ట్రం నుంచి రెండు లక్షల మంది భక్తులు వచ్చారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626.06
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 24,130
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 23,669

న్యూస్‌రీల్

ఆరు పీఏసీఎస్‌లకు అవార్డులు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)కు అవార్డులు లభించాయి. ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంకు (ఆప్కాబ్) 62వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమం సోమవారం విజయవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచిన సంఘాలకు అవార్డులు అందజేశారు. 2023–24 సంవత్సరానికి కడిమెట్ల, కొండాపురం, పాములపాడు పీఏసీఎస్‌లు, 2024–25 సంవత్సరానికి సంబంధించి పోలూరు, మద్దికెర, సి.బెళగల్ పీఏసీఎస్‌లకు అవార్డులు లభించాయి. వ్యవసాయ అనుబంధ శాఖల మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా ఆయా సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జీలు అవార్డులను అందుకున్నారు.

ఓపీఐల పదవీ కాలం పొడిగింపు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు జిల్లా గవర్నమెంట్ ప్రెస్, కర్నూలు డాక్టర్స్ కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీలకు ప్రస్తుతం ఉన్న అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ (ఓపీఐ)ల పదవీ కాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లా గవర్నమెంట్ ప్రెస్ సీహెచ్‌బీఎస్ పర్సన్ ఇన్‌చార్జీ పదవీ కాలం మార్చి 5వ తేదీతో ముగిసింది. పదవీ కాలాన్ని ఆ రోజు నుంచి సెప్టెంబరు 4 వరకు పొడిగించింది. కర్నూలు డాక్టర్స్ సీహెచ్‌బీఎస్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జీ పదవీ కాలం ఏప్రిల్ 25వ తేదీతో ముగిసింది. ఆ రోజు నుంచి అక్టోబరు 24 వరకు పదవీ కాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం సోమవారం వేరువేరు జీవోలు జారీ చేసింది.

11న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా

కర్నూలు కల్చరల్: ఐటీఐలో ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ యువకులకు ఈనెల 11న బి.తాండ్రపాడు ప్రభుత్వ ఐటీఐ(బాలికలు) కళాశాలలో అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.నాగరాజు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పారిశ్రామికవేత్తలు హాజరై అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారన్నారు. నిరుద్యోగులు ఆన్‌లైన్ పోర్టల్ http://apprenticeshipindia.gov.in లో రిజిస్ట్రేషన్ చేసుకొని తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు



ట్రాన్స్ జెండర్లకు గుర్తింపు కార్డులను అందజేస్తున్న జిల్లా కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ఇద్దరు ట్రాన్స్ జెండర్లకు గుర్తింపు కార్డులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గుర్తింపు కార్డులతో ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు, స్కాలర్‌షిప్‌లు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఇతర ప్రయోజనాలు అందుకోవచ్చని తెలిపారు. జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, విభిన్నప్రతిభావంతుల శాఖ అధికారి రాయిస్ ఫాతిమా పాల్గొన్నారు.

దత్తత ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్): బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఎంపీడీఓలను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లతో సమీక్షించారు. డివిజన్ల వారీగా సాధించిన పురోగతిపై ఆదోని సబ్ కలెక్టర్.. పత్తికొండ, కర్నూలు ఆర్డీఓలతో సమీక్షించారు. బంగారు కుటుంబాలకు ఏఏ అవసరాలు ఉన్నాయన్న నీడ్ అసెస్‌మెంట్ సర్వేపై కూడా కలెక్టర్ సమీక్షించగా ఎమ్మిగనూరు, ఓర్వకల్, హాలహర్వి మండలాలు తప్ప మిగిలిన మండలాలన్నీ వెనకబడ్డాయని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదోనిలో ఒక్క శాతం, కోసిగి, మంత్రాలయం, సీబెళగల్, దేవనకొండ మండలాల్లో అసలు పురోగతే సాధించలేదని, సంబంధిత మండలాల అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని జెడ్పీ సీఈఓను ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలు సందీప్‌కుమార్, భరత్‌నాయక్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, సీపీఓ హిమప్రభాకరరాజు పాల్గొన్నారు.

ఎరువు భారమై.. పెట్టుబడి అధికమై!

అడ్డగోలుగా ధరలు పెంచేస్తున్న కంపెనీలు

- నోరు మెదపని కూటమి ప్రభుత్వం
- ఇప్పటికే మూడుసార్లు పెరిగిన ధరలు
- ఒక్కో రైతుపై రూ.4వేల నుంచి రూ.6వేల భారం
- పెట్టుబడిలో రసాయన ఎరువుల ఖర్చే అధికం
- గగ్గోలు పెడుతున్న రైతులు

కర్నూలు(అగ్రికల్చర్): మోతాదుకు మించి రసాయన ఎరువులను వినియోగంతో వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం పెరిగిపోతోంది. ఎరువుల వినియోగాన్ని తగ్గించడమే లక్ష్యంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సి ఉండగా కాగితాలకే పరిమితం అవుతోంది. ఈ నేపథ్యంలోనే ఎరువుల ధరలు అడ్డుగోలుగా పెరిగిపోవడం పట్ల రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో ఎరువుల ధరలు పెంచే అధికారం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంది. అయితే ఉత్పత్తి వ్యయానికి అనుగుణంగా ధరలు పెంచుకునే వెసులుబాటును కేంద్రం ఫర్టిలైజర్ కంపెనీలకు ఇవ్వడంతో ధరలు ఏడాదిలో రెండు, మూడు సార్లు పెంచేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వానికి టీడీపీ, జనసేన మద్దతు ఇస్తున్నాయి. రాష్ట్రంలోనూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం కొనసాగుతోంది. అయినప్పటికీ ధరల పెరుగుదలను నిలువరించే ప్రయత్నం చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఏటా దాదాపు 5 లక్షల టన్నుల రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు. ఒక టన్ను అంటే 50 కిలోల బస్తాలు 20 ఉంటాయి. బస్తాపై కనిష్టంగా రూ.50 నుంచి రూ.330 వరకు ధర పెరిగింది. అంటే టన్నుపై కనిష్టంగా రూ.1000 నుంచి గరిష్టంగా రూ.6వేల వరకు ధర పెరగడం ఆందోళన కలిగిస్తోంది. త్వరలోనే డీఏపీ ధర కూడా భారీగా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

పెరుగుతున్న రసాయన ఎరువుల వినియోగం

ఈ సారి ముందస్తు వర్షాలతో ఖరీఫ్ సీజన్ కూడా ముందుగానే మొదలైంది. ఈ కారణంగా జిల్లాలో ఎరువుల వినియోగం గణనీయంగా పెరిగింది. ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, ఉల్లి, టమాట, కంది తదితర పంటలకు యూరియాతో పాటు డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. జిల్లాలో ఈ సారి పత్తి సాగు భారీగా పెరుగుతోంది. ఇప్పటికే 1,63,792 హెక్టార్లలో సాగయింది. హంద్రీనీవా కాల్వకు నీళ్లు పారుతుండటం వల్ల కూరగాయల సాగు కూడా పెరుగుతోంది. పలు మండలాల్లో ప్రతి 10 మంది రైతుల్లో 6గురు ఒక్కొక్కరు 20 నుంచి 30 బస్తాల వరకు ఎరువులు స్టాక్ పెట్టుకున్నారు. అంటే ఎరువులకు డిమాండ్ ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. ఈ పరిస్థితుల్లో ఎరువుల ధరలు భారీగా పెరగడం రైతులకు శాపంగా మారింది. ధరల పెరుగుదల వల్ల ఒక్కో రైతుపై రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు భారం పడుతోంది. ప్రధానంగా 14–35–14, 20–20–0–13, 16–20–0–13, 10–26–26 ఎరువులను ఎక్కువగా వినియోగిస్తున్నారు.



ఎరువుల భారం పెరిగిపోతోంది

మాకు 3.50 ఎకరాల భూమి ఉంది. కంది, సజ్జ పంటలు సాగు చేశాం. కందిలో ఇప్పుడు కాంప్లెక్స్ ఎరువులు వేయాలి. ఇందుకోసం 14–34–14 ఎరువులు అవసరం. 50 కిలోల బస్తా రూ.1,800 ప్రకారం కొన్నాం. గతంలో రూ.1,600 ఉన్న ఈ ధరను అమాంతం పెంచేశారు. ఎరువులపై పెడుతున్న ఖర్చు వల్లే పంటల సాగులో పెట్టుబడి వ్యయం అధికమైంది. ధరల పెరుగుదల వల్ల కనీసం రూ.5వేల వరకు అదనపు భారం పడుతోంది. – షేక్ ఖాశీం, ఆర్.కొట్టాల గ్రామం, తుగ్గలి మండలం



రసాయన ఎరువులు

పెరిగిన రసాయన ఎరువుల ధరలు ఇలా..

ఎరువు పేరు	పాత ధర (రూ.లలో)	కొత్త ధర
పొటాష్	1535	1800
20-20-0-13 (ప్యాక్ట్)	1300	1425
20-20-0-13 (గ్రోమర్)	1300	1350
20-20-0-13 (పీపీఎల్)	1300	1400
10-26-26	1470	1800
12-32-16 (ఇఫ్కో)	1470	1720
16-16-16	1450	1600
14-35-14 (గ్రోమర్)	1700	1800
సింగల్ సూపర్ పాస్ఫేటు	580	640
16-20-0-13	1250	1300

వైఎస్సార్‌సీపీ పాలనలో ఐదేళ్లు పెరగని ధరలు

2014–15 నుంచి 2018–19 వరకు టీడీపీ అధికారంలో ఉంది. అప్పట్లో కూడా టీడీపీ బీజేపీ కొమ్ము కాసింది. ఆ సమయంలో ఏకంగా నాలుగైదు సార్లు రసాయన ఎరువుల ధరలు పెరిగాయి. 2019–20 నుంచి 2023–24 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉంది. ఆ సమయంలో రసాయన ఎరువుల ధరలు ఒక్కసారి కూడా పెరిగిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 14 నెలల్లోనే రైతుల నడ్డి విరిగే విధంగా మూడు దఫాలుగా ధరలు పెంచడం గమనార్హం. ఎరువుల ధరలు పెంచడంలో టీడీపీ, జనసేనలు కేంద్రానికి పూర్తి మద్దతు ఇచ్చాయనే ప్రచారం జరుగుతోంది.



జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాకు వినతిపత్రం ఇస్తున్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తదితరులు

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే యూరియా కొరత

- కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రం ఇచ్చిన వైఎస్‌ఆర్‌సీపీ నేతలు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే జిల్లాలో యూరియా కొరత ఏర్పడిందని వైఎస్సార్ సీపీ ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆరోపించారు. జిల్లాలోని రైతులందరికీ యూరియాను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బి.విరూపాక్షి మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వంలో అన్నదాత తీవ్రకష్టాలను ఎదుర్కొంటున్నారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఏ గ్రామంలో అక్కడే రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, మందులు, విత్తనాలను అందుబాటులో ఉంచి రైతులకు ఇబ్బంది లేకుండా చేసినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసిందన్నారు. సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, మందులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతుండడంతో అన్నదాతలు అధిక రేట్లకు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. తక్షణమే బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. అధిక ధరలకు ఎరువులు, ఇతర మందులను అమ్మే వ్యాపారులపై లైసెన్స్‌లు రద్దు చేయాలన్నారు.

రూ.5 వేలు ఇచ్చి మోసం

పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తానని చెప్పి రూ.5 వేలు ఇచ్చి మోసం చేస్తున్నారని చెప్పారు. కేంద్రం ఇచ్చే సాయంతో సంబంధంలేకుండా రాష్ట్ర ప్రభుత్వమే రూ.20 వేలు ఇవ్వాలన్నారు. రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగాల భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ..ఉచిత పంటల బీమా ఇవ్వడం లేదని, పాలకులకు రైతుల ఉసురు తగులుతుందన్నారు. రైతు కన్నీరు కారిస్తే రాష్ట్రానికి మంచిది కాదన్నారు. రాష్ట్ర కార్యదర్శి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ..అన్నదాత సుఖీభవలో 7 లక్షల మంది రైతులకు పరిహారం ఎగ్గొట్టడం తగదన్నారు. నాయకులు రాఘవేంద్రనాయుడు, షరీఫ్, మోహన్, రామాంజనేయులు, నరసింహారెడ్డి, సర్వేశ్వరరెడ్డి, నాగేంద్ర పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పాట్లు

హొళగుంద: మండలానికి కేవలం 560 బస్తాల యూరియా రావడంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలో సుళువాయి, సమ్మతగేరి, ముగుమానుగుంది గ్రామాలకు సంబంధించి దాదాపు 5 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఈ గ్రామాలకు వేలాది బస్తాలు యూరియా అవసరముంటే సోమవారం రెండు లోడ్లు మాత్రమే వచ్చాయి. ఎవరికి పంచాలో తెలియక వీఏఏలు(విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు) తలలు పట్టుకున్నారు. కొన్ని గంటల్లోనే యూరియా పంపిణీ అయి పోయింది. మండలంలో అన్నీ గ్రామాల రైతులకు యూరియాను అందించడానికి 378 టన్నుల కోసం ఇండెంట్ పెట్టామని వ్యవసాయాధికారి ఆనంద్ లోకాదల్ చెబుతున్నారు.



సుళువాయిలో యూరియా కోసం రైతుల పడిగాపులు

అయితే ప్రభుత్వం ఆ మేర యూరియాను పంపించకపోవడంతో సమస్య వచ్చింది. ప్రభుత్వం స్పందించి యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కాలం తీరిన పదార్థాలతో విద్యార్థులకు భోజనం

- నోటీసులు జారీ చేసిన అధికారులు


కర్నూలు(హాస్పిటల్): కాలం తీరిన సరుకులతో పాఠశాలలో చదివే విద్యార్థులకు భోజనం వండి వడ్డిస్తున్నారు. తనిఖీల్లో ఈ విషయం తేలడంతో ఆహార నియంత్రణ విభాగం అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కూర్మానాయకులు ఆదేశాల మేరకు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ టి.రాజగోపాల్ నోటీసులు జారీ చేశారు. వెల్దుర్తిలోని ఎంజేపీఏపీడబ్ల్యుఆర్ స్కూల్‌లో గత జూన్‌లో ఆహార నియంత్రణ విభాగం ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాజగోపాల్ తనిఖీ చేశారు. ఆ సమయంలో అక్కడ లభించిన 56 ధనియాల పొడి ప్యాకెట్లు, అరు జబర్దస్త్ టీ పొడి ప్యాకెట్లు కాలం తీరినట్లు గుర్తించారు. వాటిని వండి పిల్లలకు వడ్డించారని తెలుసుకుని జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసును ఫైల్ చేశారు. జేసీ ఆదేశాల మేరకు పాఠశాల ప్రిన్సిపల్ షబానాబేగంకు నోటీసులు జారీ చేశారు.



పాఠశాలలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎఫ్‌ఎస్‌ఓ

8 నుంచి శ్రీ రాఘవేంద్రుల ఆరాధనోత్సవాలు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ రాఘవేంద్ర స్వామి 354వ ఆరాధన ఉత్సవాలకు సకల ఏర్పాట్లు పూర్తిచేసినట్లు శ్రీ మఠం పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు తెలిపారు. ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు రాఘవేంద్ర స్వామి సప్తరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనేపథ్యంలో సోమవారం శ్రీ మఠం గురునివాస్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. పీఠాధిపతి మాట్లాడుతూ ఆరు రోజుల పాటు జరిగే వేడుకల్లో భాగంగా 10వ తేదీన పూర్వారాధన, సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం, కాంచీపురం వరదరాజులు, శ్రీరంగపట్నం రంగనాథ స్వామి ఆలయాల నుంచి పట్టువస్త్రాల సమర్పణ ఉంటుందన్నారు. 11వ తేదిన మద్యారాధనలో భాగంగా మూలబృందావనానికి మహాపంచామృతాభిషేకం, పాదుకా పట్టాభిషేకం, స్వర్ణరథోత్సవం నిర్వహిస్తామన్నారు. 12వ తేదిన ఉత్తారాధనలో భాగంగా మూలబృందావనానికి వజ్రరత్నకవచధారణ, వసంతోత్సవం, మహారథోత్సవం కనులపండువగా చేపడతామన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక దర్శన క్యూలైన్లు ఏర్పాటు చేశామని.. వయోవృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీలు, వీఐపీల కోసం ప్రత్యేక క్యూలైన్ సదుపాయం కల్పిస్తామన్నారు.



మాట్లాడుతున్న పీఠాధిపతి సుభుధేంద్ర తీర్థులు

అన్నప్రసాద వితరణకు విరాళాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు సోమవారం మదనపల్లికి చెందిన సుబ్రహ్మణ్యం, సుమిత్ర లు రూ.లక్ష, ఒంగోలుకు చెందిన చెన్నారెడ్డి శ్రీనివాసరావు రూ.1,01,116 ఏఈవో సతీష్, పర్యవేక్షకురాలు పి.దేవిక కు అందజేశారు. విరాళాలు అందించిన దాతకు దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

పెరుగుతున్న పత్తి సాగు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఇప్పటి వరకు 3,02,715 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది ముందస్తు వర్షాల వల్ల సాగు విస్తీర్ణం పెరిగింది. అయితే అంతంతమాత్రం వర్షాలు పడుతుండటంతో పంటల్లో ఎదుగుదల లోపించింది. సాధారణ సాగు 4.22 లక్షల హెక్టార్లు ఉండగా.. 72 శాతం భూముల్లో పంటలు సాగయ్యాయి. పత్తి సాధారణ సాగు 2.34 లక్షల హెక్టార్లు ఉండగా.. ఇప్పటి వరకు 2,00,987 హెక్టార్లలో పత్తి సాగయింది. మిగిలిన పంటలన్నీ కలిపి 1.02 లక్షల హెక్టార్లలో సాగయ్యాయి. పొగాకు సాగుకు స్వస్తి పలికిన రైతులు పత్తిపై ఆసక్తి చూపుతుండటం వల్ల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. ఇప్పటి వరకు వేరుశనగ 26,925 హెక్టార్లు, కంది 31,446, టమాట 1,753, మిర్చి 4,452, ఉల్లి 9,825, వరి 3,181, సజ్జ 4,340, మొక్కజొన్న 4,025, కొర్ర 1,279, ఆముదం 8,513 హెక్టార్లలో సాగయ్యాయి.

నాణ్యతలేని ఫోన్లు మా కొద్దు



సెల్‌ఫోన్లను వెనక్కి ఇస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: ' ప్రభుత్వం 2జీ ఫోన్లకు ఇచ్చి 5జీ ఉండే పనులను చేయమంటే ఎలా.. నాణ్యత లేని సెల్‌ఫోన్లు మాకొద్దు' అంటూ సోమవారం ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్లు తమ ఫోన్లను సూపర్‌వైజర్లకు అందజేశారు. పోషణ్ ట్రాకర్, బాల సంజీవిని యాప్స్ రాక ఇబ్బంది పడుతన్నామని తెలిపారు. గర్భవతుల, బాలింతల, 0–5 సంవత్సరాల పిల్లల సమాచారం, ఫొటోలు, ఓటీపీ రావాలని ఐసీఐసీ అధికారులు ఒత్తిడి చేస్తుండటంతో ఫోన్లను వెనక్కి ఇచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ, సహాయ కార్యదర్శి నాగలక్ష్మి, అధ్యక్షురాలు శైలజ, ఉపాధ్యక్షురాలు నీరజ మాట్లాడారు. అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, రూ. 5 లక్షలు గ్రాట్యుటీ ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్

శ్రీశైలంటెంపుల్: దేవస్థానం పరిధిలో హోటల్ నిర్వాహకులు ఆహార పదార్థాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం 'సాక్షి' దినపత్రికలో 'భక్తుల జేబుకు చిల్లు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు స్పందించారు. క్షేత్ర పరిధిలోని పలు హోటల్స్‌లో ఆహార పదార్థాలు అధిక ధరలకు విక్రయించకూడదని, ధరల పట్టికను హోటల్ ముందు ప్రదర్శించాలని ఆదేశించారు. దేవస్థాన మైక్‌తో హోటల్ నిర్వాహకులకు తెలిసే విధంగా సూచనలు జారీ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

అక్కడక్కడ వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో అక్కడక్కడ వర్షాలు కురిశాయి. సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో వర్షాలు మొదలయ్యాయి. ఆరు మండలాల్లో మాత్రమే వర్షం కురిసింది. వెల్దుర్తిలో అత్యధికంగా 46.24 మి.మీ, కల్లూరులో 41.2, క్రిష్ణగిరిలో 16, కర్నూలు అర్బన్‌లో 2.8, కర్నూలు రూరల్‌లో 2.2, ఓర్వకల్‌లో 0.4 మిమీ ప్రకారం వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తం మీద సగటున 4.2 మి.మీ వర్షం కురిసింది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ ఉండగా.. మొదటి నాలుగు రోజుల్లో 4.5 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ ఉండగా.. 76.2 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. జిల్లాలో వర్షాలు అంతంతమాత్రానికే పరిమితం కావడంతో పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది.

క్లుప్తంగా

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

కోసిగి: చిన్న భూంపల్లి గ్రామానికి చెందిన దుద్ది రామలక్ష్మీ (50) అనే మహిళను దారుణంగా హత్య చేసిన భర్త నరసింహులును పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంత రెడ్డి సోమవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. గత నెల 30వ తేదీన నరసింహులు మద్యం తాగి భార్య రామలక్ష్మితో గొడవ పెట్టుకున్నాడు. ఈ క్రమంలో భార్య తలపై భర్త రోకలి బండతో మోదడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందింది. మృతుడి కుమారుడు ఉసేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సోమవారం ఉదయం గ్రామ శివారులోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఉన్న నిందితుడు నరసింహులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

క్రషర్‌లో యువకుడి మృతి

కర్నూలు (రూరల్): ఇ.తాండ్రపాడు గ్రామంలో కంకర క్రషర్‌లో జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిటన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉత్తర ప్రదేశ్ ప్రాంతానికి చెందిన అన్సర్ (18) స్థానిక స్టోన్ క్రషర్‌లో కొన్నాళ్లుగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం క్రషర్‌లో పని చేస్తుండగా అక్కడ ఉన్న వాహనం రివర్స్ అయ్యే క్రమంలో డ్రైవర్ గమనించకపోవడంతో ప్రమాదవశాత్తూ అన్సర్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృతుని సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కర్నూలు అర్బన్ పోలీసులు సోమవారం తెలిపారు.

ఆటో అదుపు తప్పి బోల్తా

పత్తికొండ రూరల్: పత్తికొండ–ఆదోని రోడ్డులోని దర్గా సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పరి మండలం చిరుమాన్‌దొడ్డికి చెందిన రైతులు కూరగాయలను విక్రయించి ఆటోలో తిరిగి ప్రయాణమయ్యారు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో బాలముని, సుంకన్న, ఈరన్న, రాజు, బాలరాజు గాయపడ్డారు. చికిత్స నిమిత్తం స్థానికులు పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు కుటుంబీకులు కర్నూలుకు తరలించారు.

అంతర్రాష్ట్ర సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్

- రూ.8లక్షలు విలువైన 56 ఫోన్లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న కోడుమూరు సీఐ తబ్రేజ్

కోడుమూరు రూరల్: నలుగురు అంతర్రాష్ట్ర సెల్‌ఫోన్ల దొంగలను కోడుమూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.8 లక్షల విలువైన 56 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సాయంత్రం కోడుమూరు సీఐ తబ్రేజ్ విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నంద్యాల జిల్లా డోన్ మండలం చిగుర్‌మాన్‌పేటకు చెందిన ఎరుకలి శశికుమార్, శ్రీను మరో ఇద్దరు మైనర్లతో కలసి ముఠాగా ఏర్పడ్డారు. నలుగురు తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని రద్దీ ప్రాంతాల్లో చాకచక్యంగా సెల్‌ఫోన్లను దొంగలించి వాటిని అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలు చేసే వారన్నారు. అనుమానంతో వీరిపై నిఘా పెట్టామన్నారు. సోమవారం ఉదయం కోడుమూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్నారని సమాచారం రావడంతో ఎస్ఐ ఎర్రిస్వామితో కలిసి నలుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న 56 సెల్‌ఫోన్లన్ని కర్ణాటకలోని బళ్లారి, చిక్ బళ్లాపూర్, హొస్పేట్, బెంగళూరు ప్రాంతాల్లో దొంగలించినట్లు విచారణలో తేలిందన్నారు. స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లన్నింటిని ఐఎంఈఐ నంబర్ల ఆధారంగా బాధితులను పిలిపించి త్వరలో అందజేస్తామన్నారు. సమావేశంలో ఎస్ఐ ఎర్రిస్వామి, ట్రైనీ ఎస్ఐ నీలకంఠ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరుకుంద క్షేత్రం.. భక్తజన సంద్రం



ప్రసాద కౌంటర్ల వద్ద భక్తుల రద్దీ



కొండ ప్రాంతంలో నైవేద్యం తయారీ చేస్తున్న భక్తులు

శ్రావణ మాసం రెండవ సోమవారం సందర్భంగా జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రం భక్తజనంతో కిటకిటలాడింది. జిల్లా నుంచే కాక తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం ఒక్క రోజు రెండు లక్షలకు పైగా భక్తులు క్షేత్రానికి చేరుకున్నట్లు అంచనా. క్షేత్ర పరిసరాల్లో భక్తుల రద్దీ ఉండటంతో భక్తులు ఎల్లెల్సీ కాల్వ పరిసరాల్లో, కొండ ప్రాంతంలో, పొలాల్లోనే స్వామి వారికి నైవేద్యం తయారు చేసి పూజలు చేశారు. తలనీలాలల, దర్శన, ప్రసాద కౌంటర్ల వద్ద భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. వాహనాల రద్దీతో భక్తులు అవస్థలు పడ్డారు. ఉరుకుందలో కోసిగి వైపు వెళ్లే వాహనాలు ఎదురెదురుగా రాకపోకలు



దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

సాగడంతో ఇరుక్కుపోయాయి. వాహనాలు ఎటు కదలకుండా రెండు నుంచి మూడు గంటలకు పైగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎమ్మిగనూరుకు చెందిన ఆర్టీసీ బస్సులు సైతం లోపలికి వెళ్లేందుకు వీలు లేకుండా ఉండి పోయాయి. కోసిగిలో రైల్వే గేటు వద్ద కిలో మీటర్ మేరకు బారులుదీరాయి. ఒక రైలు వెళ్లి గేటు తెరిచే కొన్ని వాహనాలు ముందుకు సాగేలోపు మరో రైళ్ల రాకకు గేటు పడుతుండడంతో గంటల కొద్ది నిలిచి పోయాయి.

– కోసిగి



ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన వాహనాలు



ఎల్లెల్సీ కాల్వలో స్నానాలు చేస్తున్న భక్తులు



ఆలయ ఆవరణలో టెంట్ల కింద సేద తీరిన భక్తులు

జెడ్పీలో 9 మందికి సీనియర్ సహాయకులుగా పదోన్నతి



పోస్టింగ్ ఆర్డర్స్ అందుకున్న వారితో జెడ్పీ చైర్మన్, సీఈఓ

కర్నూలు(అర్బన్): జిల్లాపరిషత్ యాజమాన్య పరిధిలోని వివిధ కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్లు/టైపిస్టులుగా విధులు నిర్వహిస్తున్న 9 మందికి సీనియర్ సహాయకులుగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు సోమవారం రాత్రి పదోన్నతి పొందిన వారికి జిల్లాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సీఈఓ జి.నాసరరెడ్డి పోస్టింగ్ ఉత్తర్వులను అందించారు.

పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం	పదోన్నతిపై కేటాయించిన కార్యాలయం
ఎం.దివాకర్	జెడ్పీహెచ్ఎస్, ఆకుమల్ల	ఎంపీపీ, కోవెలకుంట్ల
ఎం.వెంకట శ్రీదేవి	టైపిస్ట్, ఎంపీపీ, చిప్పగిరి	ఎంపీపీ, మద్దికెర
ఎం.హేమశంకర్	ఎంపీపీ, మహానంది	ఎంపీపీ, ఉయ్యాలవాడ
కె.హరిప్రసాద్	జెడ్పీహెచ్ఎస్, శ్రీశైలం	ఎంపీపీ, తుగ్గలి
ఎస్.ఎం.డి.అలీ ముర్తుజా	టైపిస్ట్, పీఐయు, నంద్యాల	పీఆర్ఐ సబ్ డివిజన్, ఆదోని
ఆర్.వీరప్రసాద్ రెడ్డి	జెడ్‌పీపీ, కర్నూలు	జెడ్‌పీపీ, కర్నూలు
ఎం.మేరీ ప్రమీల	ఆర్‌డబ్ల్యూఎస్, కర్నూలు	ఎంపీపీ, పత్తికొండ
ఎస్.అబ్దుల్ రహిమాన్	ఎంపీపీ, గోనెగండ్ల	ఎంపీపీ, మంత్రాలయం
బి.శ్రీనివాసులు	జెడ్‌పీపీ, కర్నూలు	ఎంపీపీ, కౌతాళం

బి.తాండ్రపాడు శ్మశానంలో వివక్ష

- జిల్లా కలెక్టర్‌కు అర్జీ ఇచ్చిన దళితులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు రూరల్ మండలం బి.తాండ్రపాడులోని శ్మశానంలో దళితుల మృతదేహాలను పూడ్చనీయడంలేదని, అగ్రకులాల వారు వివక్ష చూపుతున్నారని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాకు గ్రామస్తులు రత్నం, రాములమ్మ, నాగరాజు, విజయుడు, కృష్ణ తదితరులు అర్జీలు ఇచ్చారు. గ్రామంలో రెండు ఎకరాల శ్మశాన వాటిక ఉందని, అందులో ఒకరం మాదిగలకు, మిగిలిన కులాలకు ఒకరం కేటాయించారని, అయితే ఇటీవల అగ్రకులాలు మొత్తం వారికే కావాలని దౌర్జన్యం చేస్తున్నారని అర్జీలో పేర్కొన్నారు. చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ హాజరై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో వచ్చిన అర్జీలక సరైన పరిష్కారాలు చూపాలని అధికారులను ఆదేశించారు.

అర్జీల్లో కొన్ని...

→ కృష్ణగిరి మండలంలోని మాదాపురంలో 14 దళిత కుటుంబాలకు అసైన్‌మెంట్ కమిటీతో 43.23 ఎకరాలను కేటాయించారని, ఈ భూములను గ్రామంలో పలుకుబడి ఉన్న వారి పేరిట రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్లో చేశారని, చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అర్జీ ఇచ్చారు.

→ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ప్రతి కాంట్రాక్ట్ కార్మికుడిని రెగులర్ చేయాలని జిల్లా కలెక్టర్‌కు సీఐటీయూ నాయకులు అర్జీ ఇచ్చారు.

→ నన్నూరు గ్రామ కౌలు రైతు లక్ష్మమ్మకు నకిలీ పెస్టిసైడ్స్‌ను అమ్మిన వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని, శ్రేష్ట పథకం ద్వారా ఇతర రాష్ట్రాల్లో చదివిని విద్యార్థులను స్థానికులుగా గుర్తించాలని వినతిపత్రాలు ఇచ్చారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



కృష్ణమూర్తి (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పెసలదిన్నె గ్రామంలో విద్యుదా ఘాతంతో కౌలు రైతు మృత్యువాత పడ్డాడు. గ్రామానికి చెందిన నరసింహుడు కుమారుడు బోయ కృష్ణమూర్తి(34) తనకు ఉన్న ఎకరన్నరతో పాటు 5 ఎకరాలు కౌలు తీసుకోని పత్తి పంటను సాగు చేస్తున్నాడు. ఆదివారం రాత్రి భోజనం అనంతరం పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. పొలం దగ్గర ట్రాన్స్ ఫార్మర్ కింద నున్న బోర్డులో ఉన్న స్విచ్ వేసే క్రమంలో కరెంట్ షాక్‌కు అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రయినా ఇంటికి రాకపోవటం, కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో అనుమానంతో తండ్రి నరసింహుడు, మరో వ్యక్తితో కలసి పొలం దగ్గరకు వెళ్లి చూశారు. ట్రాన్స్ ఫార్మర్ సమీపంలో విగత జీవిగా పడి ఉన్న కుమారుడిని చూసి తండ్రి కన్నీరు మున్నీరుగా విలపించాడు. మృతుడికి భార్య సరోజ, కుమార్తె మానస(1) ఉన్నారు. సోమవారం విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు గ్రామానికి వెళ్లి జరిగిన సంఘటనపై వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

నిర్మాణాలు చేపట్టకపోతే స్థలాలు రద్దే!

- ధార్మిక సంస్థలకు నోటీసులు



ఓ సంస్థకు కేటాయించిన 20 ఎకరాల స్థలం

శ్రీశైలంటెంపుల్: భక్తుల సౌకర్యార్థం పలు నిర్మాణాలు చేపడతామని కొన్ని ధార్మిక సంస్థలు శ్రీశైల దేవస్థాన స్థలాలను పొందాయి. కొన్ని సంవత్సరాలుగా నిర్మాణాలు చేపట్టకపోవడంతో దేవదాయశాఖ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఎటువంటి నిర్మాణాలు చేపట్టని ఆయా సంస్థలకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. దీంతో శ్రీశైల దేవస్థాన అధికారులు ఇప్పటి వరకు ఎటువంటి నిర్మాణాలు చేపట్టని సుమారు 25 ఆయా సంస్థలకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందిన తరువాత కూడా నిర్మాణాలు ప్రారంభించకపోతే స్థలాన్ని రద్దు చేసి, దేవస్థానం స్వాధీనం చేసుకుంటుందని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.

స్థలాలు ఇచ్చారు ఇలా..

స్థలాలు ఇవ్వాలని పలు ధార్మిక సంస్థలు శ్రీశైల దేవస్థానానికి అభ్యర్థనలు పెట్టుకుంటాయి. ఆయా సంస్థల అభ్యర్థనలను పరిశీలించి వాటికి స్థలాలు కేటాయించాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనరు అనుమతులిస్తారు. కమిషనర్ అనుమతుల మేరకు క్షేత్రంలో స్థలాన్ని దేవస్థాన ఈఓ కేటాయిస్తారు.

- ఓ ప్రముఖ సంస్థ ఆయుర్వేద వైద్యశాల, వేదపాఠశాల నిర్మాణం చేపట్టి భక్తులకు సేవలందిస్తామని ప్రతిపాదనలు పంపడంతో ఆ సంస్థకు దేవస్థానం 20 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. సుమారు ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా కాంపౌండ్ వాల్ తప్ప, ఇంతవరకు ఎటువంటి నిర్మాణం చేపట్టలేదు.
- ఓ ప్రముఖ మఠం వైద్యశాల, పాఠశాల నిర్మాణం చేపడతామని ముందుకు రావడంతో ఆ మఠానికి 10ఎకరాల స్థలాన్ని కేటాయించారు. రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఆ మఠం కూడా ఇంతవరకు ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు. దేవస్థాన ఈఓ ఆ మఠం వారిని పిలిచి మాట్లాడడంతో ఇప్పుడిప్పుడే పనులు ప్రారంభించారు.

కమిషనర్ అదేశాల మేరకు చర్యలు



దాతలు, ధార్మిక సంస్థలు తీసుకున్న స్థలాల్లో నిర్మాణాలు లేవు. కొందరు పునాదులకే పరిమితం చేశారు. అందరికి నోటీసులు జారీ చేశాం. అగ్రిమెంట్ కానీ వారికి, అగ్రిమెంట్ అయినా నిర్మాణాలు చేపట్టని వారికి అగ్రిమెంట్ రద్దు చేసేందుకు రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపాం. కమిషనర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతాం.

– ఎం. శ్రీనివాసరావు, శ్రీశైల దేవస్థాన ఈఓ

గర్భిణి మృతి కేసులో ముగ్గురు అరెస్ట్

నందికొట్కూరు: నాలుగు నెలల గర్భిణి శ్రీవాణి మృతికి కారణమైన ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గడివేముల మండలం గని గ్రామానికి చెందిన గర్భిణి శ్రీవాణి అబార్షన్ వికటించి గత నెల 30వ తేదీన మృతి చెందింది. ఈ కేసులో అబార్షన్ చేసిన నందికొట్కూరుకు చెందిన ఆర్ఎంపీ గీతారాణి, అబార్షన్ చేయించిన శ్రీవాణి భర్త లోకేష్, అత్తా నాగేంద్రమ్మను అరెస్ట్ చేశారు. ముగ్గురిని కోర్టులో హాజరు పరుచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు. అలాగే ఈ కేసులో కర్నూలులోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న రక్ష హాస్పిటల్‌లో లింగనిర్ధారణ జరిగిందని, ఈ మేరకు ఆస్పత్రి స్కానింగ్ సెంటర్ టెక్నీషియన్ శేఖర్, ఆసుపత్రి మేనేజ్‌మెంట్‌పై దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీ నాయకునిపై కేసు నమోదు

సంజామల: ఆకుమల్ల గ్రామంలో టీడీపీలో వర్గ పోరు తారా స్థాయికి చేరుకుటుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకుని కేసులు పెట్టుకున్న సంగతి అందరికీ తెలిసింది. తాజాగా గత నెల 31న ఆకుమల్లకు రైతు సేవా కేంద్రానికి ఒక లారీ యూరియా బస్తాలు వచ్చాయి. టీడీపీకి చెందిన ఒక వర్గమే అన్ని బస్తాలు తీసుకుంటుందని టీడీపీకి చెందని మరో వర్గం వ్యక్తిగత ధూషణలు చేయడంతో పంచాయితీ పోలీసు స్టేషన్ చేరింది. ఈ మేరకు దుబ్బా వెంకటేశ్వర్ రెడ్డిపై బొమ్మిరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణయ్య సోమవారం తెలిపారు.

పొలాలకు ఒంటరిగా వెళ్లొద్దు

గోనెగండ్ల: చిరుత సంచరించే గ్రామాల్లో రైతులు, వ్యవసాయ కూలీలు పొలాలకు ఒంటరిగా వెళ్లొద్దని ఆదోని ఫారెస్టు రెంజ్ ఆఫీసర్ తేజశ్విని సూచించారు. సోమవారం సాయంత్రం డిప్యూటీ రెంజ్ ఆఫీసర్ నూర్జహాన్, బీటీ ఆఫీసర్ రవి కుమార్‌తో కలసి తేజశ్విని గంజిహళ్లి గ్రామానికి చేరుకుని చిరుత సంచారంపై ఆరా తీశారు. చిరుత సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట పొలాల్లో సంచరిస్తున్నది చిరుతనా... ఇతర అటవీ జంతువా అనేది తేలే వరకు ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి చిరుతను గుర్తించి, బంధించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న తేజశ్విని

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

నంద్యాల(అర్బన్): రైతు సేవా కేంద్రాలు, సొసైటీల్లో రెండు వారాలుగా పేర్లు నమోదు చేసుకున్నా యూరియా సరఫరా కాలేదంటూ సోమవారం నంద్యాల మండలం కానాల గ్రామ రైతులు ఏపీ రైతు సంఘం, సీపీఎంల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. గ్రామ సచివాలయం ప్రధాన రహదారి వద్ద రైతులు గంట పాటు రాస్తారోకో చేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు స్పందిస్తూ.. గ్రామానికి సరఫరా అయ్యే యూరియాను ప్రతి రైతుకు మూడు బస్తాల చొప్పున పంపిణీ అయ్యేలా చూస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విమరించారు. అనంతరం ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, సీపీఎం మండల కార్యదర్శి బాలవెంకట్ మాట్లాడుతూ కానాల గ్రామ రైతులు రెండు వారాలుగా ఆర్ఎస్‌కే, సొసైటీల్లో పేర్లు నమోదు చేసుకున్నారని, అధికారులు కూటమి నేతలు చెప్పిన వారికే యూరియా సరఫరా చేస్తున్నారన్నారు. యూరియా కోసం రైతులు ఎదురు చూడాల్సి వస్తుందని చెప్పారు. యూరియా పంపిణీలో రాజకీయ నాయకుల జోక్యం వల్ల అధికారులు ఇష్టానుసారంగా పంపిణీ చేస్తున్నారన్నారు. జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని జిల్లా అధికారులు చెప్పడం దుర్మార్గమన్నారు. ప్రైవేటు వ్యాపారస్తులను ఆశ్రయిస్తున్న రైతులకు నిరాశ ఎదురవుతుందని, యూరియాతో పాటు ఇతర కాంప్లెక్స్ ఎరువులు కొనాలని నిబంధనలు పెడుతున్నారన్నారు. మధ్య దళారుల దోపిడీతో రైతాంగం నష్టపోవడంతో పాటు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు అవసరమైన యూరియాను వెంటనే సరఫరా చేయాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దస్తగిరి, జాకీర్‌హుసేన్, యూసుఫ్, హుసేన్‌వలి, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న రైతులు, ఏపీ రైతు సంఘం నాయకులు



రైతులతో మాట్లాడుతున్న ఏఓ ప్రసాదరావు

జనని బ్యాంకు సీఈఓ అరెస్ట్

- ఎనిమిది మందిపై కేసు నమోదు
- నిందితురాలి ఖాతాలోని రూ. 37 లక్షలు ఫ్రీజ్
- కేసులో ఇప్పటి వరకు నలుగురి అరెస్ట్
- మరో ఇద్దరు నిందితులు పరారీ
- బెయిల్‌పై మరో ఇద్దరు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ హనుమంతునాయక్

కోవెలకుంట్ల: ఎక్కువ వడ్డీ ఆశ చూపి ఖాతాదారులను మోసం చేసి బోర్డు తిప్పేసిన జననీ బ్యాంకు కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న బ్యాంకు సీఈఓ వెంకటరమణను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ హనుమంతు నాయక్ కేసు వివరాలను వెల్లడించారు. 2021 జనవరి నెలలో వైఎస్సార్ జిల్లా చింతకొమ్మదిన్నె మండలం సోమవాండ్లపల్లెకు చెందిన ఆకుల వెంకటరమణ, కోవెలకుంట్లకు చెందిన గువ్వల పద్మావతి మరికొంత మందితో కలిసి పట్టణంలోని ఓంశాంతి భవన సమీపంలో జనని మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ పొదుపు, పరపతి సొసైటీని ఏర్పాటు చేశారు. బ్యాంకు సీఈఓగా వెంకటరమణ, కార్యదర్శిగా పద్మావతి, ఆమె కుమారుడు రవీంద్రారెడ్డి సలహాదారుడిగా, ఆమె కోడలు సౌజన్య మేనేజర్‌గా, యత్తపు వాణిదేవి గౌరవాధ్యక్షురాలిగా, హరిప్రియ కోశాధికారిగా, సుజాత అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. సొసైటీలో డబ్బులు డిపాజిట్ చేస్తే మిగతా ప్రైవేట్ బ్యాంకుల కంటే ఎక్కువ శాతం వడ్డీ ఇస్తామని, డిపాజిట్లపై రుణాలు తీసుకోవచ్చని ప్రజలను నమ్మబలికించారు.

800 మంది నుంచి రూ.1.10 కోట్ల డిపాజిట్లు..

జననీ బ్యాంకు నిర్వాహకులు మాటలు నమ్మి అధిక వడ్డీ ఆశతో కోవెలకుంట్లతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 800 మంది ఖాతాదారులుగా చేరి దాదాపు రూ.1.10 కోట్లు సేవింగ్స్, ఫిక్స్‌డ్, రికరింగ్ డిపాజిట్లు చేశారు. డిపాజిట్లు, సేవింగ్స్ ఖాతాదారుల బాండ్లకు గడవు తీరిపోవడంతో డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు సొసైటీ వద్దకు వెళ్లగా సంస్థ యాజమన్యం బోర్డు తిప్పేసింది. బాధితురాలిగా ఉన్న పట్టణానికి చెందిన రిటైర్డ్ అధ్యాపకుడి భార్య సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు ఈ ఏడాది జూన్ 2వ తేదీన కోవెలకుంట్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసి కేసును చేధించారు. బ్యాంకు సీఈఓ కోవెలకుంట్లతోపాటు చాగలమర్రి, బనగానపల్లె, నంద్యాల పట్టణాల్లో బ్రాంచ్‌లు ఏర్పాటు చేసి అక్కడ ప్రజలను మోసం చేసి డబ్బులు స్వాహా చేసినట్లు విచారణలో తేలింది. కోవెలకుంట్లలో 300 మంది, చాగలమర్రిలో 250, బనగానపల్లె 100 , నంద్యాలలో 40 మంది డబ్బులు పోగొట్టుకొని మోసపోయినట్లు గుర్తించారు. కోవెలకుంట్ల మెయిన్ బ్రాంచ్‌లో రూ. 1.10 కోట్లు స్వాహా చేయగా సీఈఓ వెంకటరమణ ఒక్కడే చాగలమర్రిలో ఒక మాజీ సైనిక ఉద్యోగికి చెందిన ఫిక్స్‌డ్ డిపాజిట్ రూ. 17.50 లక్షలతో కలిపి రూ. 30 లక్షలు, బనగానపల్లెలో రూ. 10 లక్షలు, నంద్యాలలో కొంత మొత్తం తన సొంతానికి వాడుకున్నట్లు దర్యాప్తులో తేలింది. ఇప్పటికే ఈ కేసులో గువ్వల పద్మావతి, ఆకుల భరద్వాజ్, బ్యాంకు అధ్యక్షురాలు సుజాతను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. గువ్వల పద్మావతమ్మ బ్యాంకుఖాతాలో ఉన్న రూ. 37 లక్షలను ఫ్రీజ్ చేసినట్లు పేర్కొన్నారు. సీఈఓ వెంకటరమణను పట్టణంలోని గాంధీసెంటర్ వద్ద అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. మరో ఇద్దరు నిందితులు కేసులో బెయిల్‌పై ఉండగా మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ వివరించారు. సమావేశంలో కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, ట్రైనీ ఎస్ఐ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

అమెరికా ఐవీఎల్‌పీకి డాక్టర్ వినూషారెడ్డి ఎంపిక



కర్నూలు కల్చరల్: రాజకీయాలలో మహిళల పాత్రపై అమెరికాలో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ విజిటర్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్(ఐవీఎల్‌పీ)కు భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధికార ప్రతినిధి డాక్టర్ బి.వినూషారెడ్డి ఎంపికయ్యారు. అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ ఈ ఏడాది నిర్వహిస్తున్న బహుళ ప్రాంతీయ సమావేశానికి ప్రపంచ వ్యాప్తంగా ఎంపిక చేయబడ్డ 20 మంది విశిష్ట మహిళా నాయకురాళ్లలో ఏకైక భారత ప్రతినిధి డాక్టర్ బి.వినూషరెడ్డి. ఈనెల 11 నుంచి 30వ తేదీ మధ్య మూడు వారాల పాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.